క్లుప్తంగా

నేడు సుదర్శన హోమం

తాడేపల్లి రూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని సీతానగరం విజయకీలాద్రి దివ్యక్షేత్రంపై ఆదివారం సుదర్శన హోమాన్ని నిర్వహించనున్నట్లు జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ నిర్వాహకులు పురాణం వెంకటాచార్యులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. చైత్ర అమావాస్య పర్వదినాన్ని పురస్కరించుకుని సర్వరక్షాకర సుదర్శన హోమాన్ని ఉదయం 9 గంటలకు నిర్వహించనున్నామని చెప్పారు. పాల్గొనే భక్తులు వైదిక వేషధారణలో ఉదయం 8.30 గంటలకు ఆలయానికి చేరుకోవాలని సూచించారు. హోమమునకు ఆవునెయ్యి, సమిధలు, పెసర్లు, వరి పేలాలు, నువ్వులు, తెల్ల ఆవాలు భక్తులు సమర్పించుకోవచ్చని ఓ ప్రకటనలో తెలిపారు.

స్వచ్ఛ మంగళగిరి నిరంతర ప్రక్రియ

మంగళగిరి టౌన్: స్వచ్ఛ మంగళగిరి కార్యక్రమం నిరంతర ప్రక్రియ అని మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ కమిషనర్ అలీం బాషా శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కార్యక్రమాన్ని దిగ్విజయం చేసిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. నగరాన్ని పరిశుభ్రంగా ఉంచడానికి ఇంటింటికి వచ్చే బండి సిబ్బందికి చెత్త ఇవ్వాలని, ప్లాస్టిక్ సంచులు వాడొద్దని ప్రజలను కోరారు.

సంయుక్త కార్యదర్శిగా సాయిచంద్ నియామకం



మంగళగిరి టౌన్: జాతీయ హ్యూమన్ రైట్స్ యాంటీ కరప్షన్ అండ్ యాంటీ క్రైం బ్యూరో ఆఫ్ ఇండియా ఆంధ్రప్రదేశ్ జాయింట్ సెక్రటరీగా మంగళగిరి పట్టణానికి చెందిన చదలవాడ సాయిచంద్ నియమితులయ్యారు. సంస్థ వ్యవస్థాపకులు, చైర్మన్ డాక్టర్ కేఎస్ జ్యోతీశ్వర్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. ఆయనకు రాజకీయ నాయకులు, ప్రముఖులు శనివారం శుభాకాంక్షలు తెలిపారు.

పహల్గాం మృతులకు శ్రద్ధాంజలి



తాడేపల్లి రూరల్: జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో ఇటీవల ఉగ్రవాదుల దాడిలో మృతి చెందిన వారికి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ మేరకు జనసేన నాయకులు శనివారం కొవ్వొత్తులతో ర్యాలీని నిర్వహించారు. ఉండవల్లి సెంటర్‌లో మానవహారం ఏర్పాటు చేశారు. జనసేన రూరల్ అధ్యక్షుడు సామల నాగేశ్వరరావు, అంబటి తిరుపతిరావు మాట్లాడుతూ దేశం మొత్తం ఐక్యంగా పహల్గాం ఘటనను వ్యతిరేకిస్తోందని అన్నారు. కార్యక్రమంలో జనసేన నాయకులు రాజేష్, కోటేష్ బాబు, రాజా రమేష్, వీరిశెట్టి వెంకటేశ్వరరావు, రాము, మణి తదితరులు పాల్గొన్నారు.

మురుగు కాలువ పునర్నిర్మాణానికి డిమాండ్



తాడేపల్లి రూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని ప్రభునగర్‌లో డ్రైనేజీల మీద, కల్వర్టులలో పేరుకుపోయిన చెత్తా చెదారం తొలగించేందుకు కార్పొరేషన్ ఇంజినీరింగ్ అధికారుల ఆధ్వర్యంలో సిబ్బంది కొంతభాగం కల్వర్టును, డ్రైనేజీని తొలగించారు. నెలరోజులు అయినప్పటికీ ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంతో ప్రభునగర్ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పాఠశాలలకు సెలవులు ఇవ్వడంతో కల్వర్టుల దగ్గర నిర్మాణం చేయకపోవడంతో పిల్లలు ఆడుకునేందుకు వెళ్లేటప్పుడు మురుగు కాలువలో పడుతున్నారని తెలిపారు. వెంటనే కార్పొరేషన్ అధికారులు కల్వర్టును తిరిగి నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

కార్మికుల పోరాటానికి సంపూర్ణ మద్దతు



తాడేపల్లి రూరల్ : ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు నిర్వహిస్తున్న పోరాటానికి తాడేపల్లి పట్టణంలోని టీఎన్‌టీయూసీ మినహా అన్ని అఖిల పక్ష ట్రేడ్ యూనియన్లు మద్దతుగా ఉంటాయని నాయకులు అన్నారు. శనివారం తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మానందపురంలో ఫ్యాక్టరీ కార్మికులు నిర్వహిస్తున్న దీక్షా శిబిరాన్ని సీఐటీయూ నాయకులు బూరగ వెంకటేశ్వర్లు, ఏఐటీయూసీ నాయకులు టి.వెంకటయ్య, ఏఎన్టీయూసీ నాయకులు దర్శనపు సామేలు, ఏఐఎఫ్‌టీయూ (న్యూ) నాయకులు కె. ఆదినారాయణలు సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఇప్పటికైనా జోక్యం చేసుకుని కార్మికుల సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఎన్నికలకు ముందు నారా లోకేష్ ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని కోరారు. యూనియన్ నాయకులు కూరపాటి స్టీవెన్, కార్మికులు బి. అంకయ్య, ఆశీర్వాదం, బాషా, ఇమాంబీ, సూర్య ప్రకాష్‌రావు, గురవయ్య, హగ్గయ్య, శారద, లక్ష్మి, సారమ్మ తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛతపై ఆర్భాటం.. చెత్తతో పోరాటం!

- కార్పొరేషన్ తీరుతో మంగళగిరి ప్రజలకు తప్పని అవస్థలు
- మురుగు కాలువలలో భారీగా పేరుకుపోయిన వ్యర్థాలు
- విజృంభిస్తున్న దోమలతో రోగాలబారిన పడుతున్న పట్టణ ప్రజలు
- నిషేధిత ప్లాస్టిక్ నియంత్రణపై ప్రచారం కూడా అంతంత మాత్రమే
- మార్కెట్‌లో నిషేధిత కవర్లు యథేచ్ఛగా విక్రయిస్తున్నా చర్యలు శూన్యం

ప్రభుత్వం అట్టహాసంగా చేపట్టిన స్వచ్ఛ ఆంధ్ర – స్వర్ణ ఆంధ్రలో భాగంగా మంగళగిరిలో స్వచ్ఛ మంగళగిరి కార్యక్రమాన్ని అధికారులు ప్రారంభించారు. మార్చి 17వ తేదీన మంగళగిరి తాడేపల్లి నగర పాలక సంస్థ అధికారులు, ప్రజాప్రతినిధులు ఈ కార్యక్రమంలో భాగంగా వార్డులవారీగా ఉద్యమంగా చెత్త, మురుగు తొలగించినట్లు హడావుడి చేశారు. అప్పట్లో ఫొటోలు దిగి మరీ ప్రచారం నిర్వహించారు. 30 రోజులపాటు జరిగిన స్వచ్ఛ మంగళగిరి శనివారంతో ముగిసింది. కానీ నగరంలో ఎక్కడి చెత్త అక్కడే, ఎక్కడి మురుగు అక్కడే ఉందని ప్రజలు వాపోతున్నారు.



నిషేధిత ప్లాస్టిక్ వాడకం వల్ల అనర్థాలపై మెయిన్‌బజార్‌లో అవగాహన కల్పిస్తున్న అధికారులు (ఫైల్)

మంగళగిరి: మంగళగిరి పట్టణంలో ఎక్కడ చూసినా దోమలు ప్రబలి అనారోగ్యం పాలవుతున్నామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సీజనల్ జ్వరం, తలనొప్పి, వాంతులు, విరేచనాలతో ప్రభుత్వాసుపత్రికి ప్రతి రోజు 80 మందికిపైగా బాధితులు క్యూ కడుతున్నారు. ఇక ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లే వారి సంఖ్య వంద మందికిపైగానే ఉంటుందని వైద్యులు చెబుతున్నారు. ప్లాస్టిక్ నియంత్రణ కోసం అధికారులు ప్రచారం నిర్వహించి కొన్ని దుకాణాలపై దాడులు నిర్వహించినా ప్రయోజనం అంతంత మాత్రంగానే ఉంది. మార్కెట్‌లోని దుకాణాలలో యథేచ్ఛగా నిషేధిత ప్లాస్టిక్ కవర్లు వినియోగిస్తున్నారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ కవర్లపైనా అవగాహనా ర్యాలీలు నిర్వహించారు.

లెక్కల్లో మాత్రం ఘనం

గత 30 రోజులలో నగరంలోని 65 సెక్రటరీల పరిధిలో రోజుకు 75 మంది పారిశుద్ధ్య సిబ్బంది 4 ట్రాక్టర్లు వినియోగించి చెత్తను తొలగించారు. రోడ్ల వెంట 226.8 కిలోమీటర్లు తిరిగి వ్యర్థాలు తొలగించారని అధికారులు చెప్పారు. చెత్త, ఈ–వేస్టులు 726 టన్నులు సేకరించారని పేర్కొన్నారు. 212.3 కిలోమీటర్ల పొడవున డ్రైయిన్లు, 300 ఖాళీ స్థలాలను శుభ్రపరచి మొత్తం 3627.61 టన్నుల చెత్తను వేస్ట్ ఎనర్జీ ప్లాంట్‌కు తరలించినట్లు తెలిపారు. స్వచ్ఛ మంగళగిరి విజయవంతం చేశామని అధికారులు పేర్కొంటున్నారు. కానీ మరో వైపు నగరంలోని పలు డ్రైనేజీలు చెత్త నిండిపోయింది. మురుగునీరు కదలడం లేదు. అయినప్పటికీ నగర పాలక సంస్థ అధికారులు పట్టించుకోవడం లేదని ఇంటి యజమానులే కాలువల్లో చెత్తను తొలగించుకుంటున్నారు.



నీరుకొండ దళిత శిబిరంలో ఇంటి ఎదుట కాలువలో చెత్త తీసుకుంటున్న టీడీపీ నేత

మంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్నా...

టీడీపీ నాయకులు సైతం తమ ఇంటి ముందు మురుగు కాలువలలోని చెత్తను తొలగించుకుంటూ మంత్రి నారా లోకేష్ ప్రాతినిధ్యం వహిస్తున్న మంగళగిరిలోనే పారిశుధ్యం పరిస్థితి ఎలా ఉందో చూడండని చెబుతుంటే ప్రజలు ఆశ్చర్యపోతున్నారు. ఇప్పటికైనా ప్రజా ప్రతినిధులు, అధికారులు ఏదో ప్రత్యేక కార్యక్రమం కింద స్వచ్ఛ మంగళగిరి నిర్వహించి ప్రచారం చేయడం మానుకోవాలని ప్రజలు కోరుతున్నారు. నగరపాలక సంస్థలో పారిశుద్ధ్యంపై చిత్తశుద్ధితో ప్రత్యేక దృష్టి సారించాలని పేర్కొన్నారు. ప్రతి రోజు చెత్తను, మురుగు కాలువలలోని వ్యర్థాలను తొలగించాలన్నారు. అనారోగ్యాల బారినపడకుండా చూడాలని నగర ప్రజలు కోరుతున్నారు.

ప్రచార హడావుడికి పరిమితం కారాదు



స్వచ్ఛ మంగళగిరి నెల రోజులపాటు నిర్వహించినా కాలువలలో చెత్త తొలగించకపోవడంతో మురుగు నీరు రోడ్లపైకి చేరి దోమలు ప్రబలుతున్నాయి. స్వచ్ఛ మంగళగిరి ప్రచార ఆర్భాటం తప్ప ప్రజలకు ఉపయోగపడిందేమీ లేదు. క్షేత్ర స్థాయిలో నగరంలోని ఎక్కడ చెత్త అక్కడే ఉంది. ఎక్కడ మురుగు అక్కడే నిలిచిపోయింది. పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి. ప్రజలు జ్వరాల బారిన పడకుండా అధికారులు వెంటనే చర్యలు చేపట్టాలి.

– ప్రశాంత్, మంగళగిరి

వైఎస్సార్‌సీపీ నాయకుడు మృతి



సాంబయ్య భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న డి.వేమారెడ్డి



సాంబయ్య సతీమణి సుందరమ్మను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే ఆర్కే

దుగ్గిరాల: వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు దాసరి సాంబయ్య (71) శుక్రవారం అర్ధరాత్రి అనారోగ్యం కారణంగా మృతి చెందారు. ఆయన సతీమణి సుందరమ్మ మాజీ సర్పంచ్‌గా సేవలు అందించారు. వీరికి నలుగురు సంతానం. ఇద్దరు కుమారులు వీరయ్య, రమేష్‌తోపాటు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కోడలు అరుణ దుగ్గిరాల వైఎస్సార్ సీపీ జెడ్పీటీసీ సభ్యురాలు. దుగ్గిరాల మండలం చుక్కపల్లివారిపాలెంలోని నివాసంలో శనివారం ఆయన భౌతికకాయాన్ని సందర్శించిన మంగళగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి నివాళి అర్పించారు. పార్టీ నిజాయతీ కలిగిన సీనియర్ నాయకుడిని కోల్పోయిందని పేర్కొన్నారు. మాజీ శాసనసభ్యుడు ఆళ్ల రామకృష్ణారెడ్డి కూడా సాంబయ్య భౌతికకాయానికి నివాళి అర్పించారు. సాంబయ్య సతీమణి సుందరమ్మను, కుమారుడు వీరయ్యను పరామర్శించారు. వైఎస్సార్‌సీపీ నరసరావుపేట, పల్నాడు పార్లమెంట్ నియోజకవర్గాల పరిశీలకులు మోదుగుల వేణుగోపాల రెడ్డి, పార్టీ నేతలు మేకతోటి దయాసాగర్, ఎంపీటీసీలు, గ్రామ సర్పంచ్‌లు, పలువురు కార్యకర్తలు కూడా సాంబయ్యకు నివాళి అర్పించారు.

లాడ్జీలలో ఆకస్మిక తనిఖీలు



తాడేపల్లి రూరల్ : అసాంఘిక కార్యకలాపాలను అరికట్టేందుకు పటిష్టమైన చర్యల్లో భాగంగా శనివారం తాడేపల్లి పరిధిలోని వివిధ లాడ్జీలు, హోటళ్లలో ఆకస్మిక తనిఖీలు చేసినట్లు తాడేపల్లి సీఐ కల్యాణ్‌రాజు తెలిపారు. లాడ్జీలు, హోటళ్లలో రిజిస్టర్లను కూడా ఆయన పరిశీలించారు. లాడ్జీలలో బసచేసిన వ్యక్తుల వివరాలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లాడ్జి పరిసరాలు స్పష్టంగా కనిపించేలా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అనుమానాస్పదంగా ఎవరైనా కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని అన్నారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు తావు ఇస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆధార్‌కార్డు, ఇతర వివరాల కోసం సరైన రిజిస్టర్ నిర్వహించాలని సూచించారు. ఎస్‌ఐలు, స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడి

ఫిరంగిపురం: ప్రకృతి వ్యవసాయం చేయడం ద్వారా పంటల్లో అధిక దిగుబడులు సాధించవచ్చని జిల్లా ప్రకృతి వ్యవసాయ అసోసియేట్ ఉమాదేవి అన్నారు. మండలంలోని మునగపాడు గ్రామంలో శనివారం రైతులకు ప్రకృతి వ్యవసాయం చేయడం ద్వారా కలిగే లాభాలు, చీడపీడల నివారణ పద్ధతులు గురించి వివరించారు. ఉమాదేవి మాట్లాడుతూ రైతులు వేసవికాలంలో తమ పొలాలను ఖాళీగా ఉంచకుండా రుతుపవనాలకు ముందుగా నవధాన్యాలతో కూడిన విత్తనాలు ఎకరాకు 12 కిలోలు చల్లుకోవాలన్నారు. మొలక వచ్చినది మొదలు 45 రోజుల తరువాత కొంత భాగం పశువుల మేత కోసం తీసుకోవాలన్నారు. మిగిలిన దానిని గృహ అవసరాల కోసం ఆకుకూరలు, ధాన్యాలుగా వినియోగించుకోవాలని చెప్పారు. తరువాత మిగిలిన మొత్తాన్ని భూమిలో కలియదున్నించాలని చెప్పారు. దీని ద్వారా భూమి సారవంతంగా మారుతుందన్నారు. భూమికి కావాల్సిన కర్బనం వృద్ధి చెందుతుందని, పైరును ఆశించే చీడపీడల నివారణ జరుగుతుందని తెలిపారు. అనంతరం రైతులకు (పీఎండీఎస్) నవధాన్యాల కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో యూనిట్ ఇన్‌చార్జి తిరుపతిరావు, పెద్దారావు, కృష్ణవేణి, శాంతకుమారి, రైతులు పి.నరసింహారావు, సుభాని, శివరామకృష్ణయ్య, సత్తార్, రమణయ్య పాల్గొన్నారు.



విత్తన ప్యాకెట్లు అందజేస్తున్న ఉమాదేవి

నేడు ఉచిత మెగా వైద్యశిబిరం

అమరావతి : ఐకాన్ ఓనర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అమరావతి ఐకాన్ క్లబ్ హౌస్‌లో ఈ నెల 27వ తేదీన ఉచిత మెగా వైద్యశిబిరాన్ని నిర్వహించనున్నారు. ఈ మేరకు కమిటీ సభ్యులు శనివారం తెలియజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కమిటీ సభ్యులు మాట్లాడుతూ విజయవాడ స్రవంతి హాస్పిటల్ వైద్యులు సేవలు అందించి మందులు పంపిణీ చేస్తారని తెలిపారు. క్లబ్ హౌస్ సభ్యులు ఎస్‌కే రియాజ్ బాషా, రాజశేఖర్, లక్ష్మీ వెంకటరత్నం, పి.కోటేశ్వరరావు, వై.సుబ్బారావు, పి.విక్రమ్, ముఖేష్, శేషయ్య, స్వాములు, గాదె సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదంలో మొక్కజొన్న పంట దగ్ధం

తెనాలిరూరల్: అగ్నిప్రమాదంలో మొక్కజొన్న పంట దగ్ధమైన ఘటన మండలంలోని కోపల్లె గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన నల్లూరి రామకృష్ణ రెండెకరాల్లో మొక్కజొన్న పంట వేశాడు. పొలంలో శనివారం ఉన్నట్టుండి మంటలు చెలరేగి పంట దగ్ధమైంది. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది అక్కడకు వెళ్లి మంటలను అదుపు చేశారు. రూ. 1.50 లక్షల నష్టం సంభవించి ఉంటుందని చెప్పారు.

తల్లులచే ప్రభుత్వ బడి బాట ప్రతిజ్ఞ

తెనాలి: బడి ఈడు వచ్చిన పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలంటూ సీనియర్ ఉపాధ్యాయుడు బట్టు వెంకయ్య చేపట్టిన ప్రచార కార్యక్రమం కొనసాగిస్తున్నారు. ఇందులో భాగంగా రూరల్ మండల గ్రామం సంగంజాగర్లమూడిలో శనివారం చిన్నారుల తల్లిదండ్రులచే 'ప్రభుత్వ బడి బాట' ప్రతిజ్ఞ చేయించారు. రాబోయే జూన్‌లో ఆరంభమయే విద్యాసంవత్సరంలో 5–14 సంవత్సరాల వయసు కలిగిన బాలబాలికను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పిస్తామని, రోజూ బడికి పంపిస్తామని తల్లులు ప్రతిజ్ఞ చేశారు. అంతేకాకుండా పాఠశాలల్లో జరిగే తల్లిదండ్రుల సమావేశానికి తప్పకుండా హాజరౌతామని, విద్యాసంవత్సరం మధ్యలో పిల్లలను బడి మాన్పించమని, మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలిస్తామని కూడా ప్రతిజ్ఞలో వెల్లడించారు. చుండూరు మండల గ్రామం వేటపాలెం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న బట్టు వెంకయ్య ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులు చదవాలి, తల్లిదండ్రులు ఇందుకు మద్దతునివ్వాలని కోరుతూ 90 రోజుల ప్రచార కార్యక్రమంలో భాగంగా తెనాలి మండలంలోని సంగంజాగర్లమూడిలో ఈ కార్యక్రమం చేశారు.



ప్రతిజ్ఞ చేయిస్తున్న ఉపాధ్యాయుడు బట్టు వెంకయ్య

చలివేంద్రంలో మజ్జిగ పంపిణీ

తెనాలిరూరల్: మండల గ్రామం అంగలకుదురులోని సాయిబాబా గుడి వద్ద వేసవి కాలాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన చలివేంద్రంలో మజ్జిగను పంపిణీ చేశారు. ఇక్కడ ప్రతి శనివారం ఉచిత మజ్జిగ పంపిణీ చేస్తున్నారు. దీనిలో భాగంగా రావినూతల శ్రీరామమూర్తి జ్ఞాపకార్థం మజ్జిగ పంపిణీ చేశారు. కనగాల శ్రీను, అలపర్తి వెంకయ్య, రావినూతల వెంకటేశ్వరరావు, రావినూతల ప్రకాష్ పాల్గొన్నారు.



ఉచిత వైద్య శిబిరానికి స్పందన

ఫిరంగిపురం: మండలంలోని అమీనాబాద్ గ్రామంలో శనివారం ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్‌లో భాగంగా ఫిరంగిపురం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో బఫర్ వైద్యురాలు పాల్గొని 175 మందికి షుగర్, బీపీ, థైరాయిడ్ వంటి పరీక్షలు చేశారు. అవసరమైన వారికి నెలకు సరిపడా మందులు అందజేశారు. గర్భిణులు, బాలింతలకు పరీక్షలు చేసి మందులు అందించారు. ఈ సందర్భంగా వేసవిలో గర్భిణులు, చిన్నారుల విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి వివరించారు. ప్రతి గ్రామంలోని హెల్త్ వెల్‌నెస్ సెంటర్లోను, అంగన్‌వాడీ కేంద్రాల్లోనూ ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. వడదెబ్బ తగిలిన వారు వాటిని నీటిలో కలుపుకొని తాగాలని సూచించారు. శిబిరంలో హెచ్‌వీ అన్నమేరి, ఎంఎల్‌హెచ్‌పీ అనూష, ఏఎన్‌ఎం అరుణ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



పరీక్షలు చేస్తున్న వైద్యురాలు

పన్ను వసూలులో ప్రథమస్థానం

- గత ఆర్థిక సంవత్సరంలో 78 శాతం వసూలు చేసిన ఎంటీఎంసీ
- ప్రస్తుత ఏడాది తొలి నెలలోనే 22 శాతం వసూలు చేసి రికార్డు

మంగళగిరి: మంగళగిరి తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ (ఎంటీఎంసీ) గత ఆర్థిక సంవత్సరంలో పన్ను వసూలులో రాష్ట్రంలోనే ప్రథమస్థానంలో నిలిచింది. మార్చి చివరి నాటికి 78 శాతం పన్నులు వసూలు చేసి రికార్డు సృష్టించిందని అధికారులు చెబుతున్నారు. ఎంటీఎంసీ పరిధిలో 86 వేలకుపైగా పన్ను అసెస్మెంట్‌లు ఉండగా.. అన్నింటికి కలిపి 2024–2025 ఆర్థిక సంవత్సరంలో రూ. 44.67 కోట్ల మేరకు పన్ను డిమాండ్ ఉంది. రూ. 34.62 కోట్ల మేరకు పన్నులు వసూలు చేసింది. పాత బకాయిలుతోపాటు ప్రస్తుత ఆర్థిక ఏడాదిలో రూ 42.55 కోట్లు డిమాండ్ ఉండగా... ఏప్రిల్ నెలలో ఇప్పటికే సుమారు రూ.9 కోట్లు వసూలు చేయడం విశేషం. ఏప్రిల్ నెలలోనే 22 శాతానికిపైగా పన్నులు వసూలు చేసి రికార్డు సృష్టించింది. కార్పొరేషన్‌లోని ప్రభుత్వ సంస్థలను మినహాయించి నివాసాలు, వ్యాపార సంస్థల నుంచి పన్నులు వసూలు చేయడం గమనార్హం. కార్పొరేషన్ పరిధిలో అభివృద్ధి పనులు కూడా ఇదే స్థాయిలో చేయాలని నగర వాసులు కోరుతున్నారు. దీనిపై కమిషనర్ అలీంబాషా మాట్లాడుతూ ప్రజలు ప్రభుత్వం ఇస్తున్న రాయితీలను వినియోగించుకుని పన్నులు చెల్లించాలన్నారు. పన్నులు బకాయిలు లేకుండా చెల్లించి నగర పాలక సంస్థ అభివృద్ధి సహకరించాలని కోరారు. పన్నుల వసూలులో కార్పొరేషన్ రెవెన్యూ విభాగం అధికారులు, సిబ్బంది కృషి అభినందనీయం అని పేర్కొన్నారు.

బాలల వేసవి శిబిరం బ్రోచర్ ఆవిష్కరణ

తాడేపల్లి రూరల్: మంగళగిరి తాడేపల్లి బాలోత్సవం ఆధ్వర్యంలో నిర్వహించనున్న వేసవి శిబిరం బ్రోచర్‌ను శనివారం తాడేపల్లి బైపాస్‌రోడ్‌లోని అమరావతి ఐకాన్‌లో నిర్వాహకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ ఈ నెల 28 నుంచి మే 12వ తేదీ వరకు కార్యక్రమాన్ని నిర్వహించనున్నామని తెలిపారు. డ్యాన్స్ మాస్టర్ చందు, గణితంలో నిష్ణాతులైన లెనిన్‌బాబులు ఆయా అంశాల్లో శిక్షణ ఇస్తారని పేర్కొన్నారు. ఉదయం 10 – 11 మధ్య గణితం, 11 – 12 గంటల మధ్య డ్యాన్స్ శిక్షణ ఉంటుందని వివరించారు. రూ. 500 రుసుము అని చెప్పారు. బాలోత్సవం ప్రతినిధులు ఎస్‌కే రియాజ్ బాషా, గాదె సుబ్బారెడ్డి, న్యాయవాది పి.విక్రమ్, విశ్రాంత బ్యాంక్ ఉద్యోగి కె.లక్ష్మీ వెంకటరత్నం, పట్టణ పౌర సంక్షేమ సంఘం అధ్యక్షుడు శేషయ్య, విశ్రాంత లెక్చరర్ వి.స్వాములు, పి.కోటేశ్వరరావు, వై.సుబ్బారావు, ఈదర రాజశేఖర్, వి.ముఖేష్, పి.కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

ప్రముఖుల జీవిత చరిత్ర తెలుసుకోవాలి

తాడేపల్లి రూరల్: జాతీయ నాయకులు, స్వాతంత్ర్య సమరయోధులు, శాస్త్రవేత్తల వంటి ప్రముఖుల గురించి విద్యార్థులు తెలుసుకోవాలని విజ్ఞాన భారతి రాష్ట్ర ఇన్‌చార్జి సుబ్బారాయ శాస్త్రి అన్నారు. శనివారం తాడేపల్లి రూరల్ పరిధిలోని వడ్డేశ్వరం కేఎల్ యూనివర్సిటీలో సైన్స్ కళాశాల, ఎన్‌సీసీ 10వ ఆంధ్రా బెటాలియన్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా సుబ్బారాయ శాస్త్రి మాట్లాడుతూ విద్యార్థులు సామాజిక స్పృహను కలిగి ఉండాలని తెలిపారు. అనంతరం సుబ్బారాయ శాస్త్రిని వర్సిటీ ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వీసీ డాక్టర్ జి. పార్థసారథి వర్మ, ప్రో చాన్సలర్ డాక్టర్ కేఎస్ జగన్నాథరావు, ప్రో వీసీలు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ కె.రాజశేఖరరావు, డాక్టర్ ఎస్. వెంకట్రామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, విద్యార్థి సంక్షేమ విభాగ ఇన్‌చార్జి డీన్ డాక్టర్ కేఆర్‌ఎస్ ప్రసాద్, సలహాదారు డాక్టర్ హబీబుల్లా ఖాన్, సైన్స్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె. సుబ్రహ్మణ్యం, ఎన్‌సీసీ అధికారి లెఫ్టినెంట్ పావని పాల్గొన్నారు.



సుబ్బారాయ శాస్త్రిని సత్కరిస్తున్న డాక్టర్ కేఎస్ జగన్నాథరావు తదితరులు

బాధ్యులపై అట్రాసిటీ కేసు నమోదుకు డిమాండ్

తాడికొండ: తాడికొండ మండలం కంతేరు గ్రామంలో దళిత బాలుడిపై దాడి చేసిన కేసులో జనసేనకు చెందిన వ్యక్తులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని, వెంటనే అరెస్టు చేయాలని మాల యువసేన రాష్ట్ర అధ్యక్షుడు పొందుగల చైతన్య డిమాండ్ చేశారు. శనివారం పోలీసు స్టేషన్ ఎదుట బాధితులతో కలిసి బైటాయించిన ఆయన నిందితులకు అండగా పోలీసులు వ్యవహరిస్తున్నారంటూ మండిపడ్డారు. దాడి గురించి అడిగేందుకు వెళ్లిన మహిళలపై కూడా దాడి చేయడం దారుణమన్నారు. కులం పేరుతో దూషించి ఇష్టారీతిగా వ్యవహరించిన వ్యక్తులకు కొమ్ముకాయడం పోలీసులకు సమంజసం కాదన్నారు. తాడికొండ సీఐ కె.వాసు, ఎస్సై జోజిలతో మాట్లాడిన ఆయన కేసు నమోదు చేస్తామని హామీ ఇవ్వడంతో నిరసన విరమించారు. కార్యక్రమంలో జోనల్ ఇన్‌చార్జి మదిర శేషయ్య, మాల యువసేన నాయకులు కిరణ్, విజయ్, రవిరాజు, కంతేరు గ్రామానికి చెందిన బాధితులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న పొందుగల చైతన్య, బాధితులు

విద్యా హక్కు చట్టాన్ని తెలుసుకోవాలి

కొల్లిపర: విద్య హక్కు 2009 చట్టం గురించి ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని ఎంఈఓ కె.సాల్మన్ రాజు, కె.ఝాన్సీలత అన్నారు. శనివారం స్థానిక మండల విద్యా వనరుల కేంద్రంలో విద్య హక్కు చట్టం గురించి చట్టంలోనే సెక్షన్ 12/1 సి పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంఈఓ సాల్మన్ రాజ్ మాట్లాడుతూ ఈ చట్టం ద్వారా సమాజంలో ప్రతికూల పరిస్థితుల ఎదుర్కొంటున్న వర్గాల పిల్లలు బలహీన వర్గాల పిల్లలు ప్రైవేట్ ఎయిడ్స్ పాఠశాలలో ఉచితంగా చదువు కొరకు ఒకటవ తరగతి లోనే ప్రవేశానికి ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. మండలంలో అర్హత కలిగిన వారు తమ పిల్లలను ఒకటవ తరగతి చదవబోవు విద్యార్థులను ఈ సంవత్సరం విద్యా సంవత్సరానికి మే 15వ తేదీ లోపు ఆన్లైన్లో నమోదు చేసుకోవాలన్నారు. గ్రామీణ ప్రాంతంలో 1,20,000 ఆదాయం ఉన్నవారు ఈ చట్టం కింద అర్హులుగా గుర్తించడం జరుగుతుందన్నారు. దరఖాస్తు ఆన్లైన్లో నమోదు చేసుకుని ఉండాలని సూచించారు. దీనికి అర్హత పొందిన వారు వారి పిల్లలను ఒకటవ తరగతి నుంచి పదవ తరగతి వరకు ఉచితంగా అర్హత పొందిన ప్రైవేటు స్కూల్లో చదివించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఆర్‌పీ లు పిడపర్తి రమేష్‌బాబు, వి.మురళి, బి.అలేఖ్య, డి.స్వరూపరాణి, వై.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



చట్టం గురించి సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న ఎంఈఓ సల్మాన్‌రాజు

సులభతరంగా భవన నిర్మాణ అనుమతులు

తెనాలిటౌన్: తెనాలి పురపాలక సంఘ పరిధిలోని ప్రజలు ఇళ్లు నిర్మాణం చేసుకోవడానికి సులభతరమైన భవన నిర్మాణ అనుమతులు అందుబాటులోకి వచ్చినట్లు మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జీవోఎంఎస్‌నెం.20, తేది.04-02-2025 ద్వారా స్వీయ ధృవీకరణ పథకం 2025లో భాగంగా అంగీకారపత్రం సమర్పించి సులభంగా నిర్మాణ అనుమతులు పొందవచ్చని చెప్పారు. ఈ కార్యాలయం ద్వారా లైసెన్స్ పొందబడిన లైసెన్స్ టెక్నికల్ పర్సన్, సర్వేయర్లు, ఇంజనీర్ల ద్వారా అప్రూవల్ అయిన ప్రాంతాల్లో నివాసం కొరకు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. అదే విధంగా ఆసక్తి గల అర్హులైన ఐటీఐ సివిల్,డిప్లొమా సివిల్, బిటెక్ సివిల్ అభ్యర్థులు పురపాలక సంఘ కార్యాలయానికి నేరుగా కానీ, ఏపీడీపీఎంఎస్ పోర్టల్‌ద్వారా లైసెన్స్ టెక్నికల్ పర్సన్స్, ఇంజనీర్‌ల లైసెన్స్ కొరకు దరఖాస్తు చేసుకుని లైసెన్స్ పొందవలసినదిగా కోరారు. నూతన ఎల్‌టీపీ లైసెన్స్‌ల కొరకు, భవన నిర్మాణ అనుమతులకు హెల్ప్ డెస్క్ 9849907952 నెంబరుకు సంప్రదించాలని తెలిపారు.